# ఆంధ్రప్రదేశ్ శాసన మండలి

ప్రసంగం

# శ్రీ ఇ.ఎస్.ఎల్. నరసింహన్

ఆంధ్రప్రదేశ్ గవర్నరు

ఫాల్గుణ - శుక్ల 9, 1938

6 మార్చి, 2017

గౌరవ అధ్యక్షా,

స్పీకర్ మహాశయా,

గౌరవ శాసన మండలి సభ్యులారా !

2017-18 బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఈ ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఉభయ సభల 4వ సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తున్నందుకు సంతోషంగా ఉంది. రికార్డు సమయంలో కొత్తగా నిర్మించిన శాసనసభ ప్రాంగణాలలో తొలిసారి సమావేశమవడం నిజానికి చరిత్రలో నిలిచిపోయే విషయం.

నా ప్రభుత్వం విభజనానంతరం ఏర్పడిన అనేక సవాళ్లకు బెదరకుండా ప్రతి సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకుంది. చురుకైన నాయకత్వానికి కృతజ్ఞతలు. బడ్జెట్ సంబంధ నిరోధాలు, మౌలిక సదుపాయాల లేమితో కలుపుకొని అనేక విభజనానంతర సవాళ్లు మరియు పునర్వ్యవస్థీకరణ చట్టం నుండి ఏర్పడుతున్న పరిష్కారం కాని విషయాలు నా ప్రభుత్వాన్ని అడ్డగించలేకపోయాయి. దార్శనిక నాయకత్వం ప్రతి సంక్షోభాన్ని సవాలైన అవకాశంగా మార్చుకోవాలనే తన సంకల్పాన్ని ఆధారంగా చేసుకొని రాష్ట్రం గత రెండున్నర సంవత్సరాలలో సమగ్రాభివృద్ధి చెందాలనే లక్ష్యం దిశగా పరుగులు తీయడానికి తోడ్పడింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ఉమ్మడి అభివృద్ధి విజన్‌ను పంచుకుంటూ ప్రజల సంక్షేమం కోసం గట్టిగా కృషి చేస్తున్న తరుణంలో 2022 నాటికి దేశంలో మూడు అగ్ర రాష్ట్రాలలో ఒకటిగా, 2029 నాటికి దేశంలో ఉత్తమ రాష్ట్రంగా, అంతిమంగా 2050 నాటికి అత్యంత ప్రాధాన్యత గల ప్రపంచ పెట్టుబడి కేంద్రంగా రూపొందడానికి మన రాష్ట్రం తన లక్ష్యాల విషయంలో పూర్తి స్పష్టతతో  పురోగమిస్తున్నదని మీకు సంతోషంగా తెలియజేస్తున్నాను. ఈ లక్ష్యాలను సాధించడానికి ఐదు అంశాలు అంటే గ్రాస్ వాల్యూ యాడెడ్ (జివిఎ), సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డిజి), సమాజ వికాసం, కుటుంబ వికాసం, కీలక పనితీరు సూచికల (కెపిఐ) తో కూడిన ప్రభావిత పర్యవేక్షక వ్యూహాన్ని నా ప్రభుత్వం రూపొందించింది. "సర్వత్రా సంపూర్ణ సంతోషకర సౌభాగ్య దిశ"గా మన సమాజం పూర్తిగా రూపాంతరం చెందడం కోసం ఈ సమగ్ర లక్ష్య చట్రానికి

నా ప్రభుత్వం చేపట్టిన 7 మిషన్లు, 5 గ్రిడ్లు, 5 ప్రచార పద్ధతుల క్రింద విస్తృత అభివృద్ధి విధానం ప్రాతిపదికగా ఉంటుంది.

గత రెండున్నర సంవత్సరాలలో మన పనితీరును సమీక్షించగా స్పష్టమైన సానుకూల సాఫల్యతలు కనబడుతున్నాయి. ఒక సంవత్సర రికార్డు సమయంలో ప్రతిష్ఠాకరమైన పట్టిసీమను పూర్తి చేయడం, పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి 2018 లోపు గ్రావిటి ద్వారా నీరు ఇవ్వడం, ఈ పనిని 2019 నాటికల్లా సాఫల్యం చేయడంలో ముందుకెళ్లడం, ఇతర సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యతను ఇవ్వడం, రాష్ట్రాన్ని లోటు విద్యుత్ స్థాయి నుండి ఒక మిగులు విద్యుత్ రాష్ట్రం స్థాయికి తేవడం, ఎల్ఇడి బల్బులను విరివిగా వాడటం, అనావృష్టి నివారణ చర్యలు, వాస్తవ సమయపాలన, కృష్ణా పుష్కరాలను నిర్వహించడం, రికార్డు సమయంలో నూతన తాత్కాలిక సచివాలయ, శాసనమండలి భవనాలను నిర్మించడం, భాగస్వామ్య సదస్సులలో మరియు ఇంకా అనేక విషయాలలో సమర్థ మరియు మంచి ప్రోత్సాహకర ఫలితాలు వచ్చాయి.

2017-18 సంవత్సరం నుండి ప్రణాళిక, ప్రణాళికేతర వర్గీకరణను రద్దు చేసి క్యాపిటల్ మరియు రెవెన్యూ పద్దుల క్రింద వ్యయాన్ని చూపాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా నా ప్రభుత్వం బడ్జెట్ ప్రక్రియను సరళీకరిస్తున్నది. స్పష్టమైన ఫలితాల సాధన కోసం కీలక ప్రమాణాల క్రింద పనితీరును మదింపు చేయడం ద్వారా శాఖలకు నిధులను కేటాయించాలని ఉద్దేశిస్తున్నాం.

గత సంవత్సరపు బడ్జెట్ సమావేశాల ప్రసంగంలో అగ్రస్థానంలో నిలిచి ప్రపంచ ప్రమాణాలను పొందడానికి రాబోయే 14 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ రెండంకెల వృద్ధిని సాధించడం తప్పనిసరని నేను చేసిన ప్రకటనను గుర్తు చేస్తున్నాను. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ వల్ల ఆర్థిక, ఇతర వనరులపై తీవ్ర ఒత్తిడి ఏర్పడినప్పటికీ, సవాళ్లను ఎదుర్కోవడంలో నా ప్రభుత్వ అకుంఠిత దీక్ష మరియు నిర్దిష్ట వృద్ధి లక్ష్యాల వల్ల ఫలవంతమైన ఫలితాలు రావడం ప్రారంభమయింది. తద్వారా రెండంకెల సమ్మిళిత వృద్ధిని సాధించాలనే కోరిక నేడు నిజమయింది.

2015-16 ఆర్థిక సంవత్సరంలో 10.99 శాతం ప్రభావవంతమైన ఆర్థిక వృద్ధి పనితీరును నమోదు చేయడం ద్వారా దేశంలో మన రాష్ట్రం ఒక్కటే రెండంకెల వృద్ధిని సాధించింది. ప్రస్తుత సంవత్సరంలో కూడా ప్రోత్సాహకర ధోరణులను కనుగొన్నాం. నా ప్రభుత్వ నిరంతర కృషి, వినూత్న విధానాల వల్ల 2016-17 ఆర్థిక సంవత్సరం మొదటి అర్థ భాగంలో 12.23 శాతం ఆరోగ్యకర వృద్ధి రేటును నమోదు చేసింది. పూర్తి సంవత్సరంలో రెండంకెల వృద్ధిని కొనసాగించాలని ఆశిస్తున్నది.

ఉత్పాదకత పెరుగుదల, విలువ చేర్పు కోసం వ్యూహాత్మక ప్రణాళిక, వినూత్న విధానాల ఫలితంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి అర్థ భాగం (ఏప్రిల్ - సెప్టెంబర్, 2016) లో వ్యవసాయ, అనుబంధ రంగాలు 24.44 శాతం గణనీయ వృద్ధిని చూపాయి. రాష్ట్రంలో 28 శాతం లోటు వర్షపాతం ఉన్నప్పటికీ ఈ వృద్ధిని సాధించడమయింది. వ్యవసాయం 3.69 శాతం, మత్స్య పరిశ్రమ 42.57 శాతం, పశుగణం 14.91 శాతం, ఉద్యానవనం 18.33 శాతం వృద్ధిరేట్లు వ్యవసాయ రంగానికి మద్దతుగా నిలిచాయి. 2016-17 మొదటి అర్థ సంవత్సరంలో పరిశ్రమలు, సేవల రంగాలు వరుసగా 9.98 శాతం మరియు 9.57 శాతం రంగంవారీ వృద్ధి రేట్లు సాధించి, నమ్మకమైన ఫలితాలను కూడా చూపాయి. అధిక వృద్ధిని సాధించేదిగా మరియు ఉపాధిని కల్పించేదిగా సేవా రంగం రూపొందింది. అన్ని కీలక ఉప రంగాలకు భారీ ఎత్తున ఊతమివ్వాలని నా ప్రభుత్వం యోచిస్తున్నది.

త్రాగునీరు, సాగునీరు, పారిశ్రామిక అవసరాల కోసం స్మార్ట్ వాటర్ గ్రిడ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా నీటి భద్రతపై నా ప్రభుత్వం దృష్టి సారిస్తున్నది. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి మరియు కృష్ణా నదుల అనుసంధానం కృష్ణా డెల్టా స్థిరీకరణకు తోడ్పడింది. ఫలితంగా రైతులకు గణనీయంగా లాభాలు వచ్చాయి. ఈ పథకం 14 లక్షల ఎకరాలకు ప్రయోజనం చేకూర్చే సామర్థ్యం కలిగివుంది. కేంద్ర ప్రభుత్వం మొదట తీసుకున్న నిర్ణయాలలో ఒకటైన తెలంగాణాలోని 7 మండలాలను మన రాష్ట్రానికి బదిలీ చేయాలనే నిర్ణయంవల్ల పోలవరం ప్రాజెక్టు సాకారమయిందని గుర్తు చేస్తున్నాను. పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా పరిగణించినందులకుగాను నా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలను తెలియజేస్తున్నది.

పోలవరం ప్రాజెక్టు అథారిటీకి నాబార్డు ద్వారా కేంద్ర ప్రభుత్వ సహాయం వల్ల 2019 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులను వేగవంతం చేయడానికి వీలయింది. డయాఫ్రమ్ గోడ, కాఫర్ డ్యాం, ఎర్త్-కం-రాక్‌ఫిల్ డ్యాం, క్రస్ట్ గేట్లు, స్పిల్‌వే మరియు స్పిల్ ఛానల్లు వంటి ప్రాజెక్టు పనులు పురోగతిలో ఉన్నాయి. ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడానికి వాస్తవ సమయ ప్రాతిపదికన డ్రోన్ల సహాయంతో వాస్తవిక తనిఖీ ద్వారా ప్రాజెక్టు పురోగతిని పర్యవేక్షిస్తున్నాం.

నిర్ధిష్ఠ కాలవ్యవధిలోపల ప్రత్యేక దృష్టితో అన్ని ప్రాధాన్యతా ప్రాజెక్టులను పూర్తి చేయడానికి నా ప్రభుత్వం కట్టుబడి ఉంది. తోటపల్లి, పోలవరం కుడికాలువ, గండికోట ప్రాజెక్టులను పూర్తి చేయడమయింది. పోలవరం ఎడమ కాలువ, తెలుగుగంగ, వెలిగొండ, హంద్రీనీవా మరియు గాలేరు-నగరి ప్రాజెక్టు పనులను శీఘ్రగతిన చేయడం జరుగుతున్నది. వీటిలో కొన్ని ప్రాజెక్టులు పూర్తి కావస్తున్నాయి. పురుషోత్తపట్నం మరియు నాగావళి-వంశధార నదుల అనుసంధానానికి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతున్నది. నదుల అనుసంధానం ద్వారా స్మార్ట్ వాటర్ గ్రిడ్‌ను నెలకొల్పడానికి కట్టుబడి వున్నాము.

ప్రతి నీటి చుక్కను సంరక్షించడానికి నా ప్రభుత్వం కృషి చేస్తున్నది. నీరు-చెట్టు, నీరు-ప్రగతి, పంట సంజీవిని (వ్యవసాయ చెరువులు), పంట రక్ష (రెయిన్ గన్స్), ఎన్‌టిఆర్ జలసిరి కార్యక్రమం క్రింద బోరు బావులు వంటి కార్యక్రమాల ద్వారా సుస్థిర భూగర్భ, ఉపరితల నీటి నిర్వహణ కోసం పనిచేస్తున్నది. నీటి వనరులను గరిష్ట స్థాయిలో ఉపయోగించడం కోసం సూక్ష్మ సాగునీటి సదుపాయాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని నా ప్రభుత్వం యోచిస్తున్నది. రాష్ట్రాన్ని కరవు రహితంగా చేసి అన్ని ప్రాంతాలకు సాగునీటి సదుపాయాలను కల్పించాలని ఉద్దేశిస్తున్నాం.

ఎన్‌టిఆర్ సుజల క్రింద అన్ని కుటుంబాలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందిస్తామని మేము ఇచ్చిన హామీని గౌరవ సభ్యులకు గుర్తు చేస్తున్నాను. ఈ హామీని సంపూర్తిగా నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నాం. ఫ్లోరైడ్ పీడిత మరియు క్షార పీడిత ప్రాంతాలకు స్వచ్ఛమైన త్రాగునీరు సరఫరా చేయడానికి కట్టుబడి ఉన్నాం. అన్ని సమస్యాత్మక గ్రామాలను లక్ష్యిత కార్యక్రమాల క్రిందకు తేవడమవుతుంది. వీటికి

సాధారణ బడ్జెట్ మద్దతు మాత్రమే కాకుండా ఇఎపి సహాయం కూడా ఉంటుంది.

ఉత్పత్తి మరియు ఉత్పాదకతలో వినూత్న పద్ధతులు, గణనీయంగా అభివృద్ధి చర్యలు చేపట్టడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా, ఆకర్షణీయంగా మరియు వ్యయ ప్రభావితంగా చేయడానికి నా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు వర్మి కంపోస్టును విస్తృతంగా వినియోగించడానికి, సబ్సిడీ ప్రాతిపదికపై క్షేత్ర యాంత్రీకరణ, కస్టమ్ హైరింగ్ సెంటర్లను రూపొందించడం ద్వారా అధిక వ్యయం అయ్యే యంత్ర పరికరాల నుండి చిన్న, సన్నకారు రైతులకు విముక్తి కలిగించడానికి పంట సాంద్రతను పెంచడం, అంతర పంటలను ప్రోత్సహించడానికి రైతులందరికి భూసార కార్డులను సమకూరుస్తూ సూక్ష్మపోషకాల లోపాన్ని సరిదిద్దడం వంటి కార్యక్రమాలు రైతులు అదనంగా క్షేత్ర రాబడులను ఆర్జించడానికి ఉపయుక్తంగా ఉండే కొన్ని ముఖ్యమైన చర్యలు. చంద్రన్న రైతు క్షేత్రాల ద్వారా క్లస్టర్ విధానంలో అత్యుత్తమ యాజమాన్య విధానాలను ప్రదర్శించడం ద్వారా ధాన్యం, మొక్కజొన్న, కంది, పత్తి పంటల ఉత్పాదకత స్థాయిలు మెరుగుపడడంలో మంచి ఫలితాలు ఇచ్చాయి. నా ప్రభుత్వం జిల్లాలోని ప్రతి మండలంలో క్లస్టర్లను రూపొందిస్తూ సున్నా బడ్జెట్ సహజ సేద్యాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నది. సుభాష్ పాలేకర్ గారి సున్నా బడ్జెట్ సహజ సేద్య పద్ధతులను పాటించడమవుతున్నది. ఈ విషయంలో దాతృత్వ చర్యగా అజీమ్ ప్రేమ్‌జీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడమయింది.

భారీగా రెవెన్యూలోటు ఉన్నప్పటికీ, రైతు సాధికార సంస్థ (రైతుల సాధికార సంస్థ) రుణ విమోచన పథకాన్ని అమలు చేస్తున్నట్టి విధానం నిజంగా ప్రశంసనీయం. ఈ పథకం క్రింద ఏక కాల పరిష్కారం (రూ. 50,000/- కంటే తక్కువ రుణం కలిగి ఉన్న రైతులకు) మరియు రెండు వాయిదాలలో చెల్లించే విధంగా (రూ.50,000/- మించి రూ. 1,50,000/-ల వరకు రుణం కలిగివున్న రైతులకు) ఇప్పటివరకు 55 లక్షల మంది రైతుల ఖాతాలకు రూ.11,000 కోట్ల కంటే ఎక్కువ మొత్తాన్ని చెల్లించడమయింది. రైతులకు చెల్లించవలసిన వాయిదాలకు 10 శాతం వడ్డీ చెల్లింపును కూడా కొనసాగించడమవుతున్నది. ఉద్యానవన రైతులకు కూడా రూ.385 కోట్ల వరకు రుణ మాఫీని విస్తరింప చేశాం.

నా ప్రభుత్వం వివిధ రైతు అనుకూల కార్యక్రమాలను సమర్థవంతంగా అమలుచేసినప్పటికీ, కొంతమంది నకిలీ, కల్తీ విత్తన ఉత్పత్తిదారులు మరియు డీలర్ల ముసుగులో రైతుల ప్రయోజనాలకు హాని కలిగిస్తున్నారు. ఈ బెడదను అరికట్టేందుకు ప్రత్యేక విత్తన చట్టం చేయడానికి నా ప్రభుత్వం కట్టుబడి ఉంది. తద్వారా నేరస్తులకు కఠిన శిక్షలు విధించడానికి వీలవుతుంది. రైతులకు నాణ్యమైన విత్తనాలను లభ్యంగా ఉంచడం మా బాధ్యత.

వ్యవసాయ ఆధారిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సాంప్రదాయక ఉత్పాదక ధృక్పదం నుండి విలువ ఆధారిత వేదికగా రూపొందుతున్నది. రాష్ట్రంలో ఆహార, పౌష్టికాహార భద్రతకు సంబంధించి 'ఉద్యానవన' రంగం ఒక ప్రధాన అంశంగా ఉంది. నా ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఆయిల్‌ఫామ్, బొప్పాయి, నిమ్మ, మిరప ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉండడమే కాకుండా మామిడి మరియు టమాట ఉత్పత్తిలో దేశంలో 2వ స్థానాన్ని పొందడానికి సహాయపడ్డాయి. బిందు మరియు తుంపర యంత్ర పరికరాల ద్వారా చేసిన సూక్ష్మ సేద్యం వ్యయం మరియు ఉత్పాదనల విషయంలో పటిష్టవంతమైనదిగా రుజువయింది. రాయలసీమను ఉద్యానవన కేంద్రంగా రూపొందించడానికి మేము వ్యూహాలను అమలుచేస్తున్నాం. ఫార్వార్డ్ మరియు బ్యాక్‌వర్డ్ అనుసంధానాలు కల్పించడానికి వీలుగా మరియు ఆంధ్రప్రదేశ్ ఉత్పత్తులను ప్రపంచ ప్రమాణాల స్థాయికి అభివృద్ధి చేసేందుకు వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన రైతు ఉత్పత్తిదారు వ్యవస్థల క్రిందకు వచ్చే మూడు సంవత్సరాలలో ఒక మిలియన్ రైతులను తీసుకురావాలని నా ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది.

పశుగణ రంగం తీవ్రమైన కరువు పరిస్థితుల్లో కూడా ప్రత్యామ్నాయ మరియు ఆధారపడదగిన ఆదాయ ఉత్పత్తి వనరుగా రూపొందింది. నా ప్రభుత్వం కుటుంబ వికాసం కార్యక్రమం క్రింద పశుగ్రాస భద్రత కల్పించేందుకు 50 శాతం సబ్సిడీతో దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న (బిపిఎల్) రైతుల ముంగిట్లోకే పశుగ్రాసాన్ని అందిస్తున్నది. ప్రతి కుటుంబం నెలకు కనీసం రూ.10,000/- లకు తక్కువ కాకుండా ఆదాయాన్ని పొందే విధంగా చూడడానికి పశుగణ రంగంపై దృష్టిసారిస్తూ వ్యవసాయ అస్థిరతల నుండి రైతులకు రక్షణ కల్పించేందుకు నా ప్రభుత్వం కృషి చేస్తున్నది.

ఇటీవల కాలంలో మత్స్య పరిశ్రమల రంగం అసాధారణ వృద్ధి కనబరిచింది. దేశంలోని రొయ్యల పెంపకంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 70 శాతం వాటా కలిగివుండటమే కాకుండా దేశంలోని మొత్తం సముద్ర ఆహార ఎగుమతులలో 45 శాతం వాటాను ఆక్రమిస్తున్నది. మత్స్య పరిశ్రమల రంగం 14.5 లక్షల మందికి ఉపాధి కల్పించడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన తోడ్పాటును ఇస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ 'ఆక్వా హబ్' గా తీర్చిదిద్దేందుకు నా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నది.

నా ప్రభుత్వం వనం-మనం కార్యక్రమం క్రింద ఒక ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించింది. మిషన్ హరితాంధ్రప్రదేశ్ ఉద్యమం క్రింద, రాష్ట్రంలో ప్రస్తుతం వున్న హరిత విస్తీర్ణాన్ని 2029 నాటికి 26 శాతం నుండి 50 శాతానికి పెంచాలని మేము లక్ష్యంగా నిర్ణయించాం. ఈ మొత్తం కార్యక్రమాన్ని జియో-ట్యాగింగ్ ద్వారా పర్యవేక్షించడమవుతుంది. 2017 మార్చి చివరి నాటికి అత్యధిక నగర వనాలను నిర్వహణలోకి వచ్చేటట్లు చూడటానికి సుస్థిర చర్యలు చేపట్టడమవుతున్నది. గ్రామీణ ప్రాంతాలలో అటవీ విస్తీర్ణాన్ని మెరుగుపరచేందుకు 'పల్లె-వనం' అనే కార్యక్రమాన్ని నా ప్రభుత్వం రూపొందించింది.

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ తరువాత, ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా ఉంది. వ్యవసాయాన్ని లాభదాయకమైన వృత్తిగా రూపొందించడానికి నా ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని పటిష్టపరుస్తూ శీఘ్రతర పారిశ్రామికీకరణకు ప్రేరణ ఇచ్చేందుకు వ్యవస్థీకృత సంస్కరణలను కూడా చేపడుతున్నది. పెట్టుబడులకు మంచి పర్యావరణ వ్యవస్థను కల్పించేందుకు మా ప్రభుత్వం ఆకర్షణీయమైన ద్రవ్య ప్రోత్సాహకాలతో కూడిన వినూత్న పారిశ్రామిక విధానాన్ని రూపొందించింది. ఆహార ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్ హార్డ్‌వేర్, ఆటోమొబైల్స్, ఏరోస్పేస్, డిఫెన్స్, పర్యాటక మరియు ఇతర రంగాలు వంటి వివిధ విభాగాలను అభివృద్ధి చేయడం కోసం నిర్ధిష్ట విధానాలను రూపొందించింది. ఇవి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవకాశాలు కల్పించడమే కాకుండా ఉపాధి కూడా కల్పిస్తున్నాయి.

ఒక ఏడాది క్రిందట విశాఖపట్టణంలో జరిగిన మొట్టమొదటి పెట్టుబడి సదస్సు రూ.4.67 లక్షల కోట్ల విలువైన 328 పెట్టుబడి ప్రతిపాదనలను ఆకర్షించింది. దాదాపు 48 శాతం ప్రభావిత లక్ష్యసాధన రేటుతో ఈ ప్రాజెక్టులు వివిధ అమలు, ప్రారంభ దశలలో ఉన్నాయి. నా ప్రభుత్వం 2017 జనవరిలో విశాఖపట్టణంలో వరుసగా రెండోసారి రెండురోజులు ఏపి సిఐఐ భాగస్వామ్య సదస్సుకు విజయవంతంగా ఆతిథ్యమివ్వడం గర్వించదగిన మరియు ప్రోత్సహించదగిన విషయం. 22.34 లక్షల మందికి ఉపాధిని కల్పించే సామర్థ్యంతో 10.54 లక్షల కోట్ల విలువ కలిగిన 665 అవగాహన ఒప్పందాలను (ఎంఓయులు) కుదుర్చుకోవడం ద్వారా ఈ సదస్సు అన్ని అంచనాలను మించిపోయింది. రాష్ట్రంలో వివిధ పరిశ్రమలలో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి ప్రదర్శిస్తూ ప్రపంచంలోని అన్ని మూలల నుండి పెట్టుబడిదారులు చూపించిన స్పందన ద్వారా రాష్ట్ర నాయకత్వం పై వారికి, ప్రజలకు వున్న నమ్మకం, విశ్వాసం సుస్పష్టమవుతున్నది.

ప్రపంచ బ్యాంకు మరియు పారిశ్రామిక విధానం, అభివృద్ధి శాఖ ఈ సంవత్సరం అంచనా వేసిన విధంగా సులభతర వాణిజ్య ర్యాంకింగ్స్‌లో మన రాష్ట్రం మొదటి స్థానాన్ని ఆక్రమించింది. గత సంవత్సరం ద్వితీయ స్థానంలో ఉన్న మన రాష్ట్రం, ఈ సంవత్సరం మొదటి స్థానంలో నిలుస్తామని చేసిన వాగ్దానాన్ని సాధించామని చెప్పడానికి నేనెంతో సంతోషిస్తున్నాను. వివిధ రంగాల్లో మన విశిష్ట కృషికి గుర్తింపుగా నా ప్రభుత్వం జాతీయ మరియు అంతర్జాతీయ అవార్డులను స్వీకరించింది. అవి; ఇంధన సామర్థ్యం పరిరక్షణకుగాను ఇంధన రంగంలో ఐదు అవార్డులు, అత్యుత్తమ నీటి నిర్వహణకు సంబంధించి సాగునీటి రంగంలో ఒకటి, సులభతర వాణిజ్య నిర్వహణకు సంబంధించి పారిశ్రామిక రంగంలో ఒక అవార్డు, మీ కోసం పోర్టల్-ప్రజా ఇబ్బందుల నివారణ ఫోరంకు సంబంధించి రెవెన్యూ రంగంలో ఒక అవార్డు మరియు ఇ-పరిపాలన & ఆర్థిక నిర్వహణకు సంబంధించి ఆర్థిక శాఖకు మూడు అవార్డులు పేరుకు ఇవి కొన్ని మాత్రమే. ముగిసిన 2016 సంవత్సరానికి సంబంధించి తాజా ఆర్‌బిఐ నివేదిక ప్రకారంగా ప్రైవేటు రంగ పెట్టుబడులను ఆకర్షించడంలో నా రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. సిఎన్‌బిసి-టివి 18 వారి ప్రముఖ జ్యూరీ "స్టేట్ ఆఫ్ ద ఇయర్" అవార్డును ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వడం మరియు ఇండియా బిజినెస్ లీడర్ అవార్డును సొంతం చేసుకోవడం నిజంగా గొప్ప సంతృప్తికరంగా ఉన్నది. దీనిని సాధ్యం చేసిన పలు శాఖల సిబ్బందికి నా శుభాకాంక్షలు.

ఉపాధికల్పన, ఆదాయార్జన మరియు విదేశీ మారక ద్రవ్యం, మెరుగైన పర్యావరణం, సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించడం ద్వారా సమగ్ర అభివృద్ధిని సాధించే విషయంలో పర్యాటకరంగం ఒక పటిష్టవంతమైన సాధనంగా ఉంది. కర్నూలు, ప్రకాశం, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్టణం మరియు ఇతర ప్రముఖ ప్రాంతాల్లో వారసత్వ ప్రదేశాలను అభివృద్ధి చేయడానికి నా ప్రభుత్వం కట్టుబడివుంది. తిరుపతి, శ్రీశైలం, శ్రీకాళహస్తి, కడపదర్గా, మహానంది, సింహాచలం, అన్నవరం, విజయవాడ మరియు ఇతర ప్రాంతాలు వంటి పవిత్ర స్థలాలను మతపరమైన పర్యాటక ప్రాంతాలుగా ఏకీకృతం చేయడమవుతున్నది. సమాజానికి సంబంధించిన జీవవైవిధ్య మరియు సామాజిక ఆర్థిక అవసరాలను స్థిరపరుస్తూ సముద్రతీర పర్యాటకాన్ని ప్రోత్సహించడమవుతున్నది. ప్రపంచస్థాయి కోస్తా మరియు పర్యావరణ పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడమవుతున్నది.

మధ్యతరహా మరియు చిన్నతరహా వాణిజ్య సంస్థల ప్రాముఖ్యతను, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో వాటి సంభావ్య వాటా ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుంటూ, "ఎంఎస్ఎంఇ"ల పనితీరును అభివృద్ధి చేసి, ఖాయిలాపడ్డ పరిశ్రమలను పునరుద్ధరించి, వాటి పరపతి అవసరాలకు సహాయం అందించేందుకు "ఎంఎస్ఎంఇ" అథారిటీని ఏర్పాటు చేయాలని నా ప్రభుత్వం యోచిస్తున్నది.

రాష్ట్రంలోని విద్యుత్ రంగం పలు విజయగాథలను వెల్లడిస్తున్నాది. 2014 జూన్‌లో ఉన్న 22.5 మిలియన్ యూనిట్ల లోటు నుండి మేము మిగులు విద్యుత్ రాష్ట్రంగా రూపొందడమే కాకుండా వారంలో 24 గంటలూ గృహ, పారిశ్రామిక వినియోగదారులందరికీ నాణ్యమైన విద్యుత్‌ను అందించగలుతున్నాం. విద్యుత్ రంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పాటించిన ఉత్తమ పద్ధతులను ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి. పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ బోరుబావుల విద్యుద్దీకరణకు మేము ప్రాధాన్యతను ఇస్తున్నాం. సౌర మరియు వాయు విద్యుత్ విషయంలో అదనపు సాంప్రదాయేతర ఇంధన ఉత్పత్తిపై మా యొక్క సామర్థ్య నిర్వహణ చాలా ప్రోత్సాహకరంగా ఉంది. సరఫరా మరియు పంపిణీ నష్టాలను (టి & డి) మేము కనీస

స్థాయికి విజయవంతంగా తగ్గించగలిగాం.

విజ్ఞాన సమాజాన్ని స్థాపించడానికి, అందరికి నాణ్యమైన విద్యను అందించడానికి నా ప్రభుత్వం నిబద్ధత కలిగివున్నది. 2019 నాటికి నూటికి నూరు శాతం అక్షరాస్యతను సాధించడానికి మేము అవసరమైన సంస్కరణలను చేపడుతున్నాము. పారిశ్రామిక, సమాజ అవసరాలను తీర్చడానికి యువతను సిద్ధం చేస్తున్నాము. డిజిటల్ తరగతి గదులను ఏర్పాటు చేయడం, పాఠశాలలో బయోమెట్రిక్ హాజరును అమలు చేయడం, ఉపకార వేతనాలను బయోమెట్రిక్ ఆధారంగా చెల్లించడం మరియు "ఎపి ఇ- నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్" ద్వారా ఆన్‌లైన్ తరగతులను నిర్వహించడం కొన్ని కీలక ప్రమేయాలుగా ఉన్నాయి. మాధ్యమిక పాఠశాల స్థాయిలో బడి మానేసే వారి సంఖ్యను ప్రత్యేకించి బాలికలలో తగ్గించడానికి సైకిళ్ళు పంపిణీ వంటి వినూత్న కార్యక్రమాలను అమలుచేయడమవుతుంది.

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఒక 'విజ్ఞాన రాష్ట్రం మరియు విద్యా కేంద్రంగా' చేయాలనే మా చర్యలు క్రియాశీల దశకు వచ్చాయి. ఇంజనీరింగ్, వైద్య విద్య, మేనేజ్‌మెంట్, పెట్రోలియం, లాజిస్టిక్స్, క్రీడలు మరియు ఇతరాలు వంటి పలు వాటిలో ప్రఖ్యాత నూతన సంస్థల ఆగమనంతో, నా రాష్ట్రం నూతన శిఖరాలను చేరుకుంటున్నది. ఏకగవాక్ష వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో సదరు నాణ్యమైన సంస్థలను ఏర్పాటుచేసే ప్రతిపాదనలన్నింటికి శీఘ్రగతిన అనుమతులను ఇవ్వడం జరుగుతుంది. మన నూతన రాజధాని నగరం మరియు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో అంతర్జాతీయంగా పేరుగాంచిన సంస్థలు ఇప్పటికే నిర్మాణ పనులను ప్రారంభించాయి. మన విద్యార్థులకు ఉన్నత విద్యలో ప్రవేశం కల్పించడానికి ప్రపంచంలోనే అత్యున్నత శ్రేణి విద్యాసంస్థల నుండి కూడా సహకారం కోరడం జరుగుతున్నది. ఆంధ్రప్రదేశ్ త్వరలో భారతదేశంలోని ఒక ప్రధాన విద్యాకేంద్రంగా ఆవిర్భవించగలదని నా విశ్వాసం.

నా ప్రభుత్వం 104వ భారత సైన్స్ కాంగ్రెస్‌ను తిరుపతిలో నిర్వహించింది, అందులో నోబెల్ బహుమతి గ్రహీతలతోపాటు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఇంకనూ, అంతర్జాతీయ నౌకాదళ విన్యాసాలు, మేధోసంపత్తి హక్కుల వర్క్‌షాపు, ఇండియన్ ఎకనామిక్ అసోషియేషన్, జాతీయ మహిళా పార్లమెంట్

నిర్వహణలు రాష్ట్రానికి విశిష్ట ప్రతిష్ఠాత్మక బ్రాండును కల్పిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో రాష్ట్ర ముఖ చిత్రం మెరుగుపరచుకొంది.

రాష్ట్రంలోని నిరుద్యోగ, తగినంత ఉపాధి కొరవడిన, ప్రమాణాలులేని యువతకు "సర్వహంగులతో కూడిన" నైపుణ్యాలను బోధించడానికి సమిష్టి నైపుణ్య చర్యలు మరియు నిర్మాణాత్మకమైన, సుస్థిరమైన మరియు నియత నమూనాలో సమన్విత చర్య ఉండే విధంగా చేయడానికి, ఉపాధి పొందగలిగే మరియు పటిష్టమైన నైపుణ్య అభివృద్ధి వ్యూహాలను కల్పించడానికి పేరుగాంచిన సంస్థలతో నా ప్రభుత్వం కలసి పనిచేస్తున్నది. నైపుణ్యాభివృద్ధిపై తగినంత దృష్టి సారించడం జరుగుతున్నది. 2017-18 సంవత్సరంలో పలు నైపుణ్య విభాగాల క్రింద దాదాపు 5.69 లక్షల మందికి శిక్షణ ఇవ్వాలని మేము లక్ష్యంగా చేసుకున్నాం.

యువతకు ఉపాధిని కల్పించడం అనేది మా ప్రాధాన్యత జాబితాలో అగ్ర భాగాన కొనసాగుతున్నది. అధిక జనాభా కలిగివుండటం అనే లాభాంశాన్ని అనుకూలంగా తీసుకుంటూ, అవసరమైన జీవన నైపుణ్యాలతో వారికి మార్గదర్శకం కల్పించి, అందించడానికి ఒక సమగ్రమైన యువజన విధానాన్ని తీసుకురావడానికి నిబద్ధత కలిగివున్నాం. పలు రంగాలలో అవసరమైన నైపుణ్యాలను మరియు వారిని స్వయం సహాయకులుగా చేయడం కోసం నైపుణ్యాభివృద్ధి కార్యకలాపాలను కొనసాగిస్తూ అందించడానికి మేము చర్యలు చేపట్టినప్పటికి కొంతమంది యువత నిరుద్యోగులుగా ఉంటున్నారు. ముందుగా నిర్వచించిన విద్యార్హతలతో సదరు నిరుద్యోగ యువతకు సహాయం అందించాలని నా ప్రభుత్వం నిర్ణయించి వారి శక్తి సామర్థ్యాలను సాంఘిక సేవా రంగాలలో వినియోగించుకుంటుంది.

మన ప్రజల సాంస్కృతిక వారసత్వానికి తగురీతిగా ఆదరణను ఇస్తూ, వారి యొక్క ప్రాచీన మనోభావాలు ప్రకృతి ఆరాధనను గౌరవిస్తూ నా ప్రభుత్వం కృష్ణా పుష్కరాలను అత్యంత సత్యనిష్ఠతో మరియు పండుగ వాతావరణంలో నిర్వహించింది. మన సాంప్రదాయ కళలను ప్రోత్సహించి, పరిరక్షించడం సాంస్కృతిక రూపాలను రాబోయే తరాలకు అందించడానికి నా ప్రభుత్వం ఉత్సుకతను కలిగివున్నది. కూచిపూడి నృత్యానికి మేము అందించే ప్రోత్సాహం, సాంస్కృతిక రంగంలో మా నిబద్ధతకు

సాక్ష్యంగా ఉన్నది. విజయవాడలో మేము 5వ అంతర్జాతీయ కూచిపూడి నృత్య సమ్మేళనాన్ని నిర్వహించాం. ప్రపంచ నలుమూలల నుండి 6117 మంది నృత్యకారులు ఒకచోటికి చేరి ఈ మహత్కార్యంలో పాలుపంచుకున్నారు. ఈ చారిత్రాత్మక ఘటన "గిన్నిస్ పుస్తక ప్రపంచ రికార్డుల" లో చోటు పొందింది.

మన పరిపాలన మరియు సమాజంలో తెలుగు భాష, సంస్కృతికి ఉన్నత స్థానాన్ని ఇస్తూ స్వర్గీయ ఎన్.టి. రామారావు చూపిన మార్గం నా ప్రభుత్వానికి ప్రేరణను ఇస్తున్నది. అధికార భాషా సంఘం స్థానంలో తెలుగు భాషా ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలని మేము నిర్ణయించాం. మన భాష, సంస్కృతి, సాహిత్యం, కళలు, చారిత్రక పరిశోధనను అభివృద్ధి చేసి, ప్రోత్సహించే చర్యల మార్గదర్శనం, అమలు చేయడానికి ఈ నూతన సంస్థ మరింత పరిధి, అధికారాన్ని కలిగివుంటుంది. అమలు చేయనున్న చర్యలపై సలహా ఇవ్వడానికి నా ప్రభుత్వం నియమించిన కమిటీ త్వరలోనే ఒక సమగ్ర నివేదిక ఇస్తుంది. తెలుగు భాషను పటిష్టపరచి, అభివృద్ధి చేసి, ప్రోత్సహించడానికి అన్ని చర్యలను తీసుకోవడానికి నా ప్రభుత్వం నిబద్ధత కలిగివున్నది. కమిటీ సిఫారసులను అమలు చేయడానికి త్వరలోనే మేము సంస్థలను, అకాడమీలను ఏర్పాటు చేస్తాం. తెలుగు భాష నిజమైన, పరిపాలనా భాష అవుతుందని ప్రభుత్వ కార్యాలయాలు, న్యాయస్థానాలు, శాసనమండలిలో సామాన్య ప్రజలకు అన్ని రూపాలలో పరిపాలన అందుబాటులో ఉండే విధంగా చేయడం మా ఆకాంక్ష. ఇంటర్నెట్ యుగం, భవిష్యత్ తరాల అవసరాలకు సేవలందించే విధంగా దీనిని సిద్ధం చేయడానికి మేము చర్యలు తీసుకుంటున్నాం.

క్రీడా రంగంలో నూతన శకాన్ని ప్రకటించడానికి నా ప్రభుత్వం నిబద్ధత కలిగివున్నది. ఆ ప్రకారంగా, "2017-22 క్రీడా విధానాన్ని" ప్రకటించడమయింది. దీనికి క్రీడల వినూత్న సాంకేతిక విజ్ఞానంతో స్వయం సిద్ధమైన మానవ నైపుణ్యాలను పెంచవలసిన అవసరమున్నది. జాతీయ, అంతర్జాతీయ క్రీడలలో పోటీపడి, వారు ముందుకు వెళ్ళే విధంగా చేయడానికి, క్రీడాకారులకు అవసరమైన మౌలిక సౌకర్యాల మద్దతును కల్పించడం జరుగుతున్నది. ఇటీవలి ఒలింపిక్స్‌లో కుమారి పి.వి. సింధు ఆదర్శప్రాయమైన ప్రదర్శనను గుర్తిస్తూ నా ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్ పదవి ఇస్తామని ప్రతిపాదించగా ఆమె అంగీకరించింది. క్రీడా సంస్కృతిని అభివృద్ధిచేసి

ప్రోత్సహించడానికి, క్రీడలలో పాల్గొనడాన్ని పెంచి, ఉత్తమంగా రాణించేందుకు, బాలురు, బాలికలకు 14 & 17 సంవత్సరాల కేటగిరీలకు నా ప్రభుత్వం ఖేలో ఇండియా పోటీలను నిర్వహించింది.

మానవ అభివృద్ధిలో, ఆరోగ్యం మరొక కీలక భాగంగా ఉన్నది. ప్రశూతి, శిశు సంరక్షణను మెరుగుపరచడం నా ప్రభుత్వం యొక్క అత్యున్నత ప్రాధాన్యత అంశంగా కొనసాగుతున్నది. అంతర్జాతీయ స్థాయిలకు అనుగుణంగా శిశు మరణాల రేటు, ప్రసూతి మరణాల రేటును తగ్గించే దిశగా ప్రత్యేక దృష్టిని సారించడమయింది. ఎన్‌టిఆర్ వైద్య పరీక్ష క్రింద రోగులకు ఉచిత వైద్య పరీక్షలను అందించడం, ఎన్.టి.ఆర్ వైద్య సేవ క్రింద వైద్య సేవలను పెంచడం, చంద్రన్న సంచార చికిత్స క్రింద గ్రామ స్థాయిలో సంచార వైద్య కేంద్రాలలో ఆరోగ్య సేవలు, ఆరోగ్య రక్ష, బసవతారకం మదర్-కిట్స్, ఎన్.టి.ఆర్ బేబి కిట్స్, తల్లి, ఆమెకు జన్మించిన నవజాత శిశువులను ఆసుపత్రి నుండి ఇంటికి తీసుకువెళ్ళే సదుపాయం కోసం తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్, ముఖ్యమంత్రి పట్టణ వైద్య కేంద్రం, ఇవి రాష్ట్రంలో అమలవుతున్న కొన్ని ఆరోగ్య కార్యక్రమాలు. ఆరు నెలలు వచ్చేంత వరకు పిల్లల ఎదుగుదల ముఖ్యంగా తల్లిపాలు త్రాగే వారి పోషణ లక్ష్యాన్ని సాధిస్తూ 99 శాతం గర్భిణీ స్త్రీలకు క్రమం తప్పకుండా అనుబంధ పోషకాహారాన్ని సమకూర్చడమవుతుంది. గర్భిణీ మహిళకు నా ప్రభుత్వం రూ.6,000/-లను అందిస్తున్నది. శిశువులలో పౌష్టికాహర లోపాన్ని తగ్గించడం, రోగ నిరోధక స్థాయిలను మెరుగుపరచడం (0-5 సంవత్సరాలు) లో గణనీయమైన విజయాలను నమోదు చేయడంతోపాటు ఆరోగ్యానికి సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించడానికి నా ప్రభుత్వం అన్ని చర్యలను తీసుకుంటున్నది.

ముఖ్యమైన అంటువ్యాధుల ప్రమాదాలను గుర్తించి నియంత్రించడానికి నా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దోమల ప్రమాదాన్ని నివారించడానికి ప్రచార కార్యక్రమం క్రింద "దోమలపై దండయాత్ర"ను చేపట్టడమయింది. అంటువ్యాధుల నియంత్రణ కోసం ప్రమాణాలను ఏర్పాటు చేయడం ద్వారా నివారించడంలో పటిష్ఠమైన సమన్వయ చర్య నా ప్రభుత్వ ప్రాధాన్యతా అంశంగా ఉన్నది.

అమరావతిలో ప్రపంచ స్థాయి రాజధాని నగరాన్ని నిర్మించాలని మా ఆకాంక్ష. ఆ

లక్ష్యాన్ని సాధించడంలో నా ప్రభుత్వం ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటుంది. రాజధాని నగరం, భారతదేశం మొత్తానికి బహుశా ప్రపంచంలోనే ఒక ఆదర్శప్రాయంగా ఉంటుందని నా ప్రగాఢ నమ్మకం. నా ప్రభుత్వం రాజధాని నగరంలో తొమ్మిది థీమ్ ఆధారిత నగరాలను ప్రతిపాదించింది. రాజధాని నగర ఆర్థిక - సామాజిక ఆధారాలుగా వ్యవహరించే విధంగా ఈ ఉప-నగరాలను రూపొందించడమవుతుంది. ప్రతి ఒక్క ఉప-నగరం రాజధాని నగర పరిధిలో విశిష్ట విధులను అందించే కార్యకలాపాల కేంద్రంగా తన పాత్రను పోషిస్తున్నది. ఆ నమూనాలకనుగుణంగా మన రాజధాని నగర నిర్మాణానికి చేయూతనందించడానికి నా ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం మొత్తాన్ని నూతన రాజధాని నగర నిర్మాణ పరిసర ప్రాంతంలో మోహరించింది. తాత్కాలిక సచివాలయం, శాసన సభ మరియు అనుసంధాన రహదారులను వేగంగా నిర్మించడం రాజధాని నగర వృద్ధిని వేగవంతమైన నమూనాలో ఉంచింది. దిగ్గజ రాజధాని రూపకల్పన, నిర్మాణానికి అవసరమైన ఉత్తమ కన్సల్టెంట్‌లను ప్రపంచ వ్యాపితంగా కోరడమయింది. ఆధునీకృత డిజైన్, రూపంతో మన ప్రజల సంస్కృతి, చరిత్ర, సాంప్రదాయాలలో విశిష్టతను కలిగివుంటాము.

అమరావతిని గ్రీన్ ఫీల్డ్ రాజధాని నగరంగా అభివృద్ధి చేయడం కోసం వినూత్న భూ సమీకరణ యంత్రాంగం క్రింద తమ భూములను ఇచ్చినట్టి రాష్ట్రంలోని రైతులకు పెద్ద సహాయంగా ఇటీవల బడ్జెట్‌లో మూలధన లాభాలపై పన్ను మినహాయింపును ఇచ్చినందుకు నా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతతో వుంది. రాజధాని నగరానికి తమ భూములను ఇచ్చిన రైతుల కోసం సంపదను సృష్టించడం నా ప్రభుత్వానికి అత్యంత ప్రాముఖ్యతగల అంశంగా ఉంది.

నా ప్రభుత్వం పట్టణీకరణ సవాళ్లను ఎదుర్కోవడానికి వివిధ సంస్థలను, ప్రత్యేక ఉద్దేశిత వాహకాలను ఏర్పాటు చేసింది. ఆకర్షణీయ నగరాలయిన విశాఖపట్టణం, కాకినాడ, తిరుపతిలలోని పట్టణ స్థానిక సంస్థల (యుఎల్‌బిలు) ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయడం కోసం, నా ప్రభుత్వం ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను సరైన రీతిలో వినియోగించుకునేలా చూడటంతో పాటుగా అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూరుస్తున్నది. రాష్ట్ర మద్దతును ఇచ్చే ఆకర్షణీయ నగరాలు, 'అమృత్' నగరాలపైన దృష్టి సారించడమవుతున్నది. నా రాష్ట్రం అన్ని పట్టణ ప్రాంతాల

కోసం బహిరంగ మల విసర్జన రహిత (ఓడిఎఫ్) ప్రమాణాన్ని సాధించి దేశంలో మొదటి స్థానంలో ఉంది. మొదటి దశలో రాష్ట్రంలోని 33 పట్టణ స్థానిక సంస్థలలో పట్టణ నీటి సరఫరా, వరద నీటి కాలువలు, మురుగుపారుదల సౌకర్యాలు, ప్రజా రవాణాను సమకూర్చడం మరియు హరిత ప్రదేశాలను ఏర్పాటు చేయడం పైనా మా దృష్టి వుంది. మిగిలిన యుఎల్‌బిలన్నింటిలో 2018 నాటికి ఈ సౌకర్యాలను సమకూర్చడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఆర్థిక అవసరాలను తీర్చడానికి ఐఎల్ & ఎఫ్ఎస్ - ఆంధ్రప్రదేశ్ పట్టణ మౌలిక సదుపాయాల ఆస్తుల నిర్వహణ లిమిటెడ్‌తో ఒక జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటుచేయడమయింది. త్వరలోనే విజయవాడ, విశాఖపట్టణంలో "మెట్రోరైలు" వాస్తవిక రూపంలోకి వస్తుంది. విశాఖపట్టణం మెట్రోను పిపిపి విధానంలో నిర్మించాలని ప్రణాళిక చేస్తున్నాం. విజయవాడ చుట్టూరా 110 కి.మీ.ల మేర హై స్పీడ్ సర్క్యులరు సబ్ అర్బన్ రైలును చేపట్టడం కోసం చర్యలను సైతం ప్రారంభించడమయింది.

ఎన్‌టిఆర్ గ్రామీణ గృహనిర్మాణ పథకం క్రింద పేదలు మరియు అణగారిన వర్గాలకు ఆశ్రయం కల్పించడానికి నా ప్రభుత్వం కట్టుబడి వుంది. పట్టణ ప్రాంతాలలో భరించదగ్గ గృహనిర్మాణ కార్యక్రమం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన క్రింద గృహాల నిర్మాణాన్ని చేపట్టడానికి కార్యక్రమాన్ని రూపొందించడమయింది. నిధుల దుర్వినియోగం, అవాస్తవిక ఆస్తుల కల్పన ద్వారా రాష్ట్ర నిధులను స్వాహా చేయడం వంటివి గతంలో జరిగినట్లు గమనించడమయింది. ఈ అనైతిక, అవినీతి పద్ధతులు పునరావృతం కాకుండా నివారించడానికి పనులు ప్రారంభించడానికి ముందు మరియు నిర్మాణంలో వివిధ దశల వద్ద గృహాలకు జియో ట్యాగింగ్‌ను చేయడమవుతున్నది. ప్రాధాన్యత ప్రాతిపదికన సుమారు 4 లక్షల పూర్తికాని గృహాలను పూర్తి చేయడాన్ని నా ప్రభుత్వం చేపట్టింది. వచ్చే రెండు సంవత్సరాలలో 10 లక్షల గృహాలను పూర్తి చేయాలనే లక్ష్యంతో విడిగా గ్రామీణ, పట్టణ గృహనిర్మాణ కార్యక్రమాలను చేపట్టడమవుతున్నది. ఈ లక్ష్యంలో భాగంగా 2017-18 సంవత్సరంలో 4 లక్షల గృహాలను నిర్మించాలనే కార్యక్రమాన్ని రూపొందిస్తున్నాం. లబ్ధిదారు సమాచారం అంతటినీ ఒక పారదర్శక విధానంలో డిజిటల్‌గా నిర్వహిస్తూ పర్యవేక్షించడమవుతున్నది.

ఆంధ్రప్రదేశ్‌ను ఒక లాజిస్టిక్ హబ్ మరియు తూర్పుకు సింహ ద్వారంగా తీర్చిదిద్దే

చర్యలలో భాగంగా నా ప్రభుత్వం 974 కి.మీ.ల పొడవైన కోస్తా తీరాన్ని తగురీతిగా వినియోగించుకుంటూ ఓడరేవు ఆధారిత అభివృద్ధి నమూనాను ప్రోత్సహిస్తున్నది. మచిలీపట్నం, భావనపాడు ఓడరేవుల భూ సమీకరణ, భూ సేకరణ పనులను నా ప్రభుత్వం ప్రారంభించింది. దేశీయ జల మార్గాల ముందరి భాగంలో కోస్తా జిల్లాలైన తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలలో సరిహద్దుల నిర్ణయం ద్వారా గుర్తించిన భూమి కోసం భూ సేకరణను వేగవంతం చేస్తున్నాం. ప్రాధాన్యతగా కాకినాడ నుండి భోగాపురం బీచ్ కారిడార్ ప్రాజెక్టు కోసం భూమి గుర్తింపుకు సంబంధించిన పనిని వేగవంతం చేస్తున్నాం. కృష్ణపట్నం-తడ-తిరుపతి వద్ద కోస్తా ఆర్థిక మరియు ఉపాధి జోన్‌ను ఏర్పాటు చేసే పని శీఘ్రగతిన జరుగుతున్నది. కాకినాడ వద్ద ప్రతిపాదిత పెట్రోలియం ఆర్థిక మండలి కీలకమయిన చమురు, సహజ వాయువు రంగంలో దేశీయ ఉత్పాదనను బలోపేతం చేస్తుందని ఆశించడమయింది.

విజయవాడ, తిరుపతి, విశాఖపట్టణం విమానాశ్రయాలు ప్రయాణీకుల రద్దీ పరంగా దేశంలో అత్యధిక అభివృద్ధిని నమోదు చేశాయి. భోగాపురం, ఓర్వకల్లు, దగదర్తి వద్ద నూతన విమానాశ్రయాల పనులు, విజయవాడ, రాజమండ్రి వద్ద విస్తరణ పనులు జరుగుతున్నాయి.

సక్రమ రోడ్ నెట్‌వర్క్ అనుసంధానతను పటిష్టవంతమయిన వృద్ధికి వీలు కల్పించేదిగా గుర్తిస్తూ నా ప్రభుత్వం వైజాగ్ - చెన్నై పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం క్రింద 372 కి.మీ.ల పైబడిన రోడ్లను 4 వరుసల డ్యూయల్ క్యారేజివేలుగా వెడల్పు చేయాలని ప్రతిపాదిస్తున్నది. ఈ కారిడార్ అభివృద్ధి కోసం ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి) సహాయాన్ని తీసుకోవడమవుతున్నది. అంతేగాక, నా ప్రభుత్వం 2017-18 లో 1000 కి.మీ.ల ఏక వరుస రోడ్లను రెండు వరుస రోడ్లుగా వెడల్పు చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. అన్ని జిల్లాల నుండి రాష్ట్ర ప్రధాన కార్యస్థానానికి రోడ్డు అనుసంధానత మరియు వివిధ ప్రదేశాలకు రోడ్డు మరియు రైలు అనుసంధానత ఉండేలా చూడటానికి కట్టుబడి ఉన్నాం. ఈ ప్రాజెక్టులో భాగంగా, కడప, కర్నూలు, బెంగుళూరును అనుసంధానిస్తూ అమరావతి - అనంతపురము ఎక్స్‌ప్రెస్‌వే, అమరావతికి రింగు రోడ్డు, రాయపూర్ - విశాఖపట్టణం రోడ్డు అభివృద్ధి పనులను ప్రాధాన్యతాపరంగా చేపట్టడమవుతుంది. అన్ని జాతీయ రహదారుల అభివృద్ధిని చేపట్టడమవుతుంది.

ఆంధ్రప్రదేశ్‌ను సత్వరంగా ఐటి కంపెనీలకు ఒక ప్రాధాన్యత గమ్యస్థానంగా తీర్చిదిద్దడానికి నా ప్రభుత్వం చర్యలను తీసుకుంటున్నది. విజయవాడలోని నూతన ఐటి సర్వీసు పార్కులో 8 ఐటి కంపెనీలు కార్యకలాపాలను ప్రారంభించాయి. విశాఖపట్టణంను జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యత గల "ఫిన్‌టెక్ హబ్"గా అభివృద్ధిపరచడమవుతున్నది. తిరుపతిని ఎలక్ట్రానిక్ క్లస్టర్‌గా అభివృద్ధి చేయడమవుతున్నది. అనేక అగ్రగామి కంపెనీలు ఇదివరకే వారి ప్లాంట్లను నెలకొల్పాయి.

నా ప్రభుత్వం ఆన్ లైన్ ఫీడర్ మానిటరింగ్ సిస్టం, వ్యవసాయ బోరుబావుల జియో ట్యాగింగ్, స్మార్ట్ మీటరింగ్ ఇన్‌స్టలేషన్, ప్రభుత్వ కార్యక్రమాల అమలు సమయాలలో ఉద్యోగుల మధ్య ఆటంకాలులేని ప్రతిస్పందన కోసం మరియు హెచ్‌టి వినియోగదారులు "కైజాలా యాప్" ను వినియోగించడం వంటి అనేక సాంకేతిక సంబంధ అనుసంధానతలను వర్తింపులో పెట్టింది. నా ప్రభుత్వం ప్యాకేజిని సమకూర్చుతూ వినూత్న ఫైబర్‌గ్రిడ్‌ను అమలుపర్చింది. ఇందులో 15 ఎంబిపిఎస్ స్పీడ్‌తో ఇంటర్నెట్, వీడియో, అన్ని ఛానళ్లతో టివి, మూడు ఫోను సదుపాయాలను నెలకు రూ.149/-ల భరించదగ్గ వ్యయంతో రాష్ట్రంలోని గృహాలన్నింటికి సమకూర్చడం జరుగుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను రూపాంతరీకరిస్తూ పూర్తిగా ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటి) అనుకూలమైనదిగా మారడంలో కొన్ని గ్లోబల్ కంపెనీల సహాయంతో పైలట్ ప్రాజెక్టుగా తూర్పుగోదావరి జిల్లాలోని మోరీ గ్రామాన్ని అభివృద్ధి పర్చడమయింది. ఆ గ్రామం, కుటుంబాలన్నింటికి వైఫై, ఇంటర్నెట్ కనెక్టివిటీ, కేబుల్ టివీ అందుబాటును కల్పిస్తూ, తక్కువ నగదు ఆర్థిక వ్యవస్థ దిశగా మరలుతూ దేశంలో ఇ-ఎగ్జాంపుల్‌గా నిలిచింది. ఈ ప్రాజెక్టు విజయం దీనిని మొదటి దశలో ఐదు శాసనసభ నియోజకవర్గాలకు విస్తరింపచేసేలా మమ్ములను ప్రోత్సహించింది.

పెద్ద నోట్ల రద్దును నా ప్రభుత్వం సమర్థిస్తున్నది. 2016 నవంబరు 8వ తేదీన రూ.1000 మరియు రూ.500 నోట్ల రద్దును ప్రకటించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్య నిజంగా అభినందనీయం. మన ఆర్థిక వ్యవస్థ నుండి నల్లధనాన్ని, మన రాజకీయ నల్లధన వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు, రూపుమాపేందుకు ఈ చర్య దీర్ఘకాలం కొనసాగుతుంది. అధిక విలువగల నోట్లు చట్టబద్ధత కోల్పోయిన తరువాత నగదు లభ్యత

లేకపోవడం వల్ల ప్రజలకు ఏర్పడే తాత్కాలిక ఇబ్బందులను నివారించేందుకు నా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఈ కష్టతర పరిస్థితిని నా ప్రభుత్వం ఒక అవకాశంగా చేసుకొని, డిజిటల్ చెల్లింపులకు ప్రోత్సాహకాలను ఇవ్వడం ద్వారా ప్రజలను డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సహించింది. రాబోయే రోజుల్లో తక్కువ నగదు ఆర్థిక వ్యవస్థ దిశగా గణనీయమైన పురోగతి సాధించాలని మేము యోచిస్తున్నాం. నగదు లావాదేవీలతో పోల్చినపుడు డిజిటల్ చెల్లింపులకు సంబంధించిన అతి తక్కువ పరస్పర వినిమయ వ్యయాలు డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు ప్రోత్సహిస్తుందని మేము గట్టిగా విశ్వశిస్తున్నాం. ఈ విషయంలో నా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుంది. నల్లధనాన్ని పూర్తిగా ఏరివేసే లక్ష్యాన్ని సాధించేందుకు, మన ఎన్నికల ప్రక్రియ నిజాయితీగా, పారదర్శకంగా వుండేటట్లు తీర్చిదిద్దడానికి ఇంకనూ అవినీతిని పూర్తిగా అరికట్టే విధానం, పరిపాలనలో సమర్ధవంతమైన జవాబుదారీ, పారదర్శక వ్యవస్థ, అధిక విలువ గల కరెన్సీ నోట్ల రద్దు మరియు ఇతర చర్యలు వంటి వాటిని చేపట్టాలని నా ప్రభుత్వం విశ్వసిస్తున్నది.

ప్రజా ఇబ్బందులన్నింటినీ, వ్యక్తిగత సమస్యలను పరిష్కరించడానికి, ఐటి ఆధారిత పరిష్కారాలను అందించడానికి కట్టుబడి ఉన్నాం. ప్రాజెక్టులో ఇ-ప్రగతి చాప్టర్ క్రింద విద్యుద్దీకరణ, పరిశుభ్రత, కాలుష్య నియంత్రణ వంటి కార్యక్రమాలలో సాంకేతిక విజ్ఞానాన్ని సమర్ధవంతంగా వినియోగించడం ద్వారా రియల్ టైం డేటాను సేకరించగలిగాం. సేవల బట్వాడాను మరింత పారదర్శకత, బాధ్యతాయుతమైనదిగా తీర్చిదిద్దే మా కృషిలో ఇ-ప్రగతి ప్రాజెక్టులో భాగంగా పౌరసేవలన్నింటినీ ఆన్‌లైన్ ద్వారా అందించాలని నా ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది. నా ప్రభుత్వం 2017-18 సంవత్సరాన్ని ఇ-ప్రగతి సంవత్సరంగా ప్రకటించింది. ఆన్‌లైన్ ప్రమాణీకరణలతో డిజిటల్ రూపంలో నేరుగా ప్రజల సామాజిక ఆర్థిక సమాచారాన్ని సేకరించే సమగ్ర కసరత్తుగా నా ప్రభుత్వం చేపట్టిన ప్రజా సాధికార సర్వే మా సంక్షేమ, అభివృద్ధి చర్యల కోసం ఉపయుక్తకరంగా ఉంటుంది.

అభివృద్ధి చర్యలను చేపడుతూ లక్ష్యాన్ని చేరుకోవాలనే ఉద్దేశంతో సంక్షేమ చర్యలు తగ్గిపోతున్నందున, పేదలు నిరుపేదలుగా అవుతున్నందున గణనీయమైన సంఘటిత అభివృద్ధితో పేదరికాన్ని నిర్మూలించటానికి ఆర్థిక సంస్కరణలను, ప్రభావవంతమైన ద్రవ్య నిర్వహణలను వేగవంతంగా నా ప్రభుత్వం అమలు చేయగలదని

విశ్వసిస్తున్నది. 'ఎన్‌టిఆర్ భరోసా' పథకం ద్వారా అనాథ మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కేటగిరీలతో కలుపుకొని జనాభాలో దుర్బల స్థితిలో వున్న వర్గాలన్నింటికి రాష్ట్రం ద్వారా అందించబడుతున్న ఆర్థిక సహాయంలో భిన్న పెరుగుదల వారి ఆత్మగౌరవాన్ని, ఆర్థిక స్వతంత్రతను గణనీయంగా పెంచింది. అనాథ మహిళలు, వృద్ధులకు నెలవారీ పింఛను రూ.200/-ల అల్ప మొత్తం నుండి రూ.1000/- లకు పెంచడమయింది. దివ్యాంగులు కూడా వారి నెలవారీ పింఛనును రూ.1500/-లకు పెంచడం వల్ల సంతోషంగా ఉన్నారు. ఇప్పుడు 45.68 లక్షల మంది ప్రజలు ఈ సంక్షేమ పింఛన్‌లను అందుకుంటున్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో లబ్ధిపొందుతున్న 3.94 కోట్ల మంది బిపిఎల్ కార్డుదారులకు నా ప్రభుత్వం భద్రతను కల్పిస్తోందన్న విషయం నాకు బాగా సంతృప్తినిచ్చింది. నా ప్రభుత్వం పేద కుటుంబాల వారికి కిలో బియ్యం రూ. 1/- చొప్పున ఒక్కొక్కరికి 5 కిలోలను సరఫరా చేస్తున్నది. రాష్ట్ర ఖజానాపై అదనపు భారం ఉన్నప్పటికీ, రేషన్ దుకాణాల డీలర్లకు "చెల్లించదగు మార్జిన్"లను పెంచాం. చౌకధరల దుకాణాలలో ఇ-పాస్ యంత్రాల ద్వారా సరకులను పొందడం కోసం అంగన్‌వాడి కార్యకర్తలకు నిత్యావసర సరకులను సరఫరా చేయడానికి చర్యలను కూడా తీసుకోవడమయింది. పిడిఎస్ క్రింద నిత్యావసర సరకులను ప్రభావవంతంగా సరఫరా చేయడంలో టెక్నాలజీని, పూర్తి స్థాయిలో కంప్యూటర్ సొల్యూషన్‌లను వినియోగించిన ఫలితంగా ప్రభుత్వానికి గణనీయమైన ఆదా అయింది మరియు వివిధ వర్గాల నుండి బాగా ప్రశంసలు అందాయి. ప్రతి కుటుంబం తమ పండుగలను జరుపుకోవడానికి సహాయం అందించాలనే దృష్టితో క్రిస్మస్ కానుక, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అనే పథకాల క్రింద ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులను అందించడమవుతున్నది.

నా ప్రభుత్వం రాష్ట్రంలో సాంప్రదాయ వంట చేసే పద్ధతి కారణంగా ఏర్పడే కష్టాలను తగ్గించి వారి ఆరోగ్యస్థితిని మెరుగుపర్చడానికి, వంట చెరకు కోసం అడవులపై ఆధారపడే పరిస్థితిని తగ్గించడానికి, రాష్ట్ర పర్యావరణాన్ని మెరుగుపర్చడానికి బిపిఎల్ కుటుంబాల మహిళలకు ఎల్‌పిజి కనెక్షన్‌లను సమకూరుస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌ను 2017, జూన్ నాటికి 'నూటికి నూరు శాతం' ఎల్‌పిజి కనెక్షన్లు ఉన్న (కిరోసిన్ రహిత) రాష్ట్రంగా

ప్రకటించడానికి నా ప్రభుత్వం అవసరమైన చర్యలను తీసుకుంటున్నది.

పేదరికాన్ని రూపుమాపి, సాధికారతను పెంచడానికి ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు మరియు కార్యకలాపాల ద్వారా సేవలను అందించడానికి నా ప్రభుత్వం ఒక పటిష్టవంతమైన ఏకీకృత సంస్థాగత యంత్రాంగాన్ని ఆచరణలో పెట్టింది. 'అన్న ఎన్‌టిఆర్ క్యాంటీన్'ను అమలు చేయాలని నా ప్రభుత్వం తీవ్ర కృషి చేసింది. రాష్ట్రంలోని అవసరార్థులు, పేద ప్రజలకు సబ్సిడితో కూడిన భోజనాన్ని అందించడమే ఈ పథకం ఉద్దేశం. రాష్ట్రంలోని పురపాలక సంస్థలన్నింటిలో ఈ పథకాన్ని అమలుచేయాలని ప్రతిపాదించడమయింది.

అసంఘటిత కార్మికులు మరణించినపుడు లేదా అట్టి వారికి అంగవైకల్యం ఏర్పడినపుడు వారి కుటుంబాలకు దుఃఖం, కష్టాలను తగ్గించడానికి అసంఘటిత కార్మికుల కుటుంబాలకు సహాయాన్ని అందించాలని నా ప్రభుత్వం చంద్రన్న బీమా సామాజిక భద్రతా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం క్రింద ప్రమాద మరణం, పూర్తి అశక్తతకు రూ.5 లక్షలను, పాక్షికంగా అశక్తులైన వారికి రూ.3,62,500 లను, సహజ మరణానికి రూ.30,000 లను అందిస్తున్నది. కార్మికుల పిల్లలకు వారి విద్యను కొనసాగించేందుకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నది. సముద్రంలో వేటకు వెళ్ళి తప్పిపోయిన మత్స్యకారులకు ఈ బీమా పథకాన్ని వర్తింపచేయాలని ఉద్దేశిస్తున్నాం.

ఎస్‌సిలు, ఎస్‌టిలు, బిసిలు, మైనారిటీలు, కాపులు, బ్రాహ్మణుల సంక్షేమం కూడా మా సంక్షేమ అజెండాలో ఒక భాగంగా ఉంది. సంక్షేమ కార్యకలాపాలన్నింటిలో మరింత సమన్వయం కలిగివుండాలని, వారి సేవల బట్వాడా, పటిష్టతను, సమర్థతను మదింపు చేయడం కోసం ఒక యంత్రాంగాన్ని కలిగివుండాలని యోచిస్తున్నాం. వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేయడమవుతున్నది. 11 లక్షల కంటే ఎక్కువ మంది వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించడమవుతున్నది. వారి సంక్షేమం కోసం స్థాపిత సంస్థలు తీసుకున్న సముచిత చర్యల ద్వారా కాపు, బ్రాహ్మణ వర్గాల ప్రయోజనాలను కాపాడటమవుతున్నది. కాపు కమ్యూనిటీని, ఇతర ఆర్థికంగా వెనుకబడిన కులాలను, వెనుకబడిన తరగతుల కేటగిరీలో చేర్చేందుకు అధ్యయనం చేయడానికి నా ప్రభుత్వం జస్టిస్ కె.ఎల్. మంజునాథ్

కమీషన్‌ను ఏర్పాటు చేసింది. కమీషన్ నివేదికను సమర్పించిన తరువాత, వెనుకబడిన తరగతుల వారి ప్రయోజనాలకు భంగం కలుగకుండా సిఫారసులను అమలు చేయటానికి నా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుంది.

విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించాలని ఆశిస్తున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి మరియు కాపు విద్యార్థులకు నా ప్రభుత్వం సహాయం అందిస్తున్నది. ఎన్‌టిఆర్ విద్యోన్నతి పథకం క్రింద సివిల్ సర్వీసు పరీక్షల కోసం 2,250 విద్యార్థులకు కోచింగ్‌ను ఇవ్వడమవుతున్నది. నెలవారీ విద్యుత్ వినియోగం 50 యూనిట్లకు మించని రాష్ట్రంలోని 10.5 లక్షల ఎస్‌సి కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకం క్రింద ప్రయోజనం కల్పించడమయింది. విద్యుత్ రీయింబర్స్‌మెంట్ పథకం క్రింద రాష్ట్రంలోని 2.32 లక్షల ఎస్‌టి కుటుంబాలు లబ్ధి పొందాయి. స్కాలర్‌షిప్ పథకాల క్రింద ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి, మైనారిటీ వర్గాలకు చెందిన సుమారు 20 లక్షల మంది విద్యార్థులు వర్తింపులో వున్నారు. స్కాలర్‌షిప్ పథకాలన్నింటిని ఆన్‌లైన్ విధానంలోనే అమలుపర్చడమవుతున్నది. పారదర్శకమైన పర్యవేక్షణ వ్యవస్థతో సకాలంలో చెల్లించడమయింది.

సంతోషకరమైన సంఘటిత సమాజం కోసం పేదరికాన్ని నిర్మూలించడం అనేది అత్యంత ముఖ్యమైనదని నా ప్రభుత్వం ధృఢంగా విశ్వసిస్తున్నది. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (ఇబిసి), బాగా వెనుకబడిన తరగతుల (ఎంబిసి) వారికి పూర్తి మద్దతును అందించడానికి మేము బద్ధులమై ఉంటాము. దీనికి అదనంగా, సంతృప్తత ప్రాతిపదికన ఇబిసి విద్యార్థులకు ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయడమవుతున్నది. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి ప్రత్యేక బడ్జెటు పద్దును ఏర్పాటు చేస్తూ ఆర్థిక మద్దతు పథకాల క్రింద ఆర్థిక మద్దతును అందించాలని కూడా ఉద్దేశిస్తున్నాం.

నా ప్రభుత్వం ముస్లిం, క్రిస్టియన్ వర్గాల సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలతో ముందుకు వచ్చింది. వారి పిల్లల తరగతి గది పనితీరును మెరుగుపరుస్తూ, ఆయా సామాజిక వర్గాల విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని, శిక్షణను, ప్లేస్ మెంట్‌ను, పోటీ పరీక్షల కోసం కోచింగ్‌ను ఇవ్వడమవుతున్నది. వక్ఫ్ బోర్డు ద్వారా ఇమామ్‌లకు, మౌజాములకు గౌరవ వేతనాన్ని చెల్లించడమయింది.

సాంప్రదాయ హస్తకళల పనితీరులో బహుశ చాలా వరకు వాస్తవిక ఉత్పత్తులలో అవాస్తవిక సాంస్కృతిక ప్రమాణాలు ఉన్నాయని భావిస్తున్నాం. ఈ వర్గాల వారి నైపుణ్యాలను, పరిజ్ఞానాన్ని కాపాడి, పరిరక్షించడానికి చేతి వృత్తులు, హస్తకళల వారికి ఆర్థిక మద్దతును అందించడమవుతున్నది. నేతకారుల వర్గం సమగ్ర, గణనీయమైన అభివృద్ధిని సాధించే ప్రమేయాలపై నా ప్రభుత్వం దృష్టి సారించింది. చేనేత రంగానికి చెందిన సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వడమయింది. రుణభారం నుండి నేతకారుల వర్గానికి సహాయాన్ని అందించటానికి రూ.110 కోట్లు వ్యయమయ్యే రుణ విమోచన పథకాన్ని అమలుచేయడమయింది. రాష్ట్రంలోని చేనేత, మరమగ్గాల నేతకారుల సమస్యలపై స్పందిస్తూ, సాంప్రదాయ వృత్తులను పటిష్టపరచడం ద్వారా ఉత్పత్తి దశ నుండి ఆర్థిక విలువ చేర్పును గరిష్టతరం చేయడానికి నా ప్రభుత్వం కట్టుబడి ఉంది. నూలు సబ్సిడీ, వడ్డీ సబ్సిడీ, క్రెడిట్ కార్డు పథకం, మార్కెటింగ్ అభివృద్ధి, ముద్రా పథకం వంటి అనేక పథకాల ద్వారా నేతకారులకు ఆర్థిక సహాయాన్ని అందించడమవుతున్నది.

పేదరికాన్ని నిర్మూలించడానికి "సామాజిక రాజధాని" ని వినియోగించుకోవడం ద్వారా సంపదను సృష్టిస్తూ అత్యంత సమ్మిళిత అభివృద్ధి సాధించేలా చూడటం నా ప్రభుత్వానికి ప్రామాణికంగా ఉంది. రూపావళి మార్పులో, పసుపు-కుంకుమ కార్యక్రమం క్రింద, 84 లక్షల పైబడిన స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జిలు) మహిళలకు వారి కార్పస్‌లోని మూలధన సహాయంగా ఎస్‌హెచ్‌జిలకు మూలధనం క్రింద ఒక్కొక్క సభ్యురాలికి రూ.10,000/-ల చొప్పున రూ.8,400ల కోట్ల మొత్తాన్ని మంజూరు చేయడమయింది. అందులో మొదటి దశలో గ్రామీణ, పట్టణ రెండింటికి 82 లక్షల మంది ఎస్‌హెచ్‌జి సభ్యులకు రూ.4,972 కోట్లను విడుదల చేయడమయింది. దీనికి అదనంగా, రూ.10,200 కోట్లకు పైబడి మూలధన సహాయం పూర్తి పరిమాణాన్ని పరిగణనలోకి తీసుకుంటూ 2014, ఫిబ్రవరి నుండి 2015, ఏప్రిల్ వరకు "వడ్డీ విమోచన గ్రాంటు" క్రింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 6.20 లక్షల ఎస్‌హెచ్‌జిలకు రూ.1,339 కోట్లను చెల్లించడమయింది. బ్యాంకుల నుండి రుణాలను వినియోగించుకోవడానికి కార్పస్‌లోని ఈ పెరుగుదలను వినియోగించుకోవాలని ఎస్‌హెచ్‌జిలు భావిస్తున్నాయి. అందువల్ల, ఎస్‌హెచ్‌జి సభ్యులు ఆదాయంలో పెరుగుదల కోసం దోహదపడే ఆర్థిక

కార్యకలాపాలను పెంచుకోవడానికి వీలవుతుంది. నా ప్రభుత్వం మహిళలను సామాజిక సేవల క్రియారహిత లబ్ధిదారులుగా కాకుండా క్రియాశీలక ఆర్థిక వ్యవస్థ ప్రతినిధులుగా విశ్వసిస్తున్నది. పేదరిక నిర్మూలన, మహిళల సాధికారత కోసం ప్రాథమిక సాధనంగా మహిళలపై కేంద్రీకరణతో ఎస్‌హెచ్‌జిలను అభివృద్ధిపర్చడానికి కట్టుబడివుంది.

అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం సమకూర్చబడిన ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ కేటగిరీ నిధులను గరిష్టంగా వినియోగించుకొనిన కొద్ది రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటని ప్రకటించడానికి సంతోషిస్తున్నాను. ఈ డిమాండు ఆధారిత కార్యక్రమం ఉపాధి కల్పనకు మాత్రమే కాకుండా, ఆస్తుల కల్పనకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది. దానికి ఈ సంవత్సరంలో పథకం క్రింద మన రాష్ట్రంలో 9,900 కి.మీ. సి.సి రోడ్లను వేయడమే నిదర్శనం. 15 రోజుల లోపు పనిచేసిన కార్మికులందరికీ 90 శాతం చెల్లింపులు చేశామనే విషయానికి అంతే ప్రాధాన్యత వుంది. వివిధ శాఖల ద్వారా గ్రామీణ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి ఆస్తుల కల్పనకు కేంద్రీకరణ వ్యూహాన్ని అమలుపర్చడమవుతున్నది. ఈ వ్యూహం క్రింద, వ్యవసాయ కుంటలు, ఐహెచ్‌హెచ్‌ఎల్‌ఎస్, వెర్మికంపోస్టు, ఉద్యానవనాలు, ఎవెన్యూ ప్లాంటేషను, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, మండల భవనాలు, సిసి రోడ్లు, ఆట స్థలాల నిర్మాణం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇతర అవసరమైన గ్రామీణ మౌలిక సదుపాయాలను అభివృద్ధి పర్చడమయింది. వ్యవసాయ కుంటలు, వెర్మికంపోస్టు, సిసి రోడ్లు వంటి ఆస్తుల కల్పనలో ఆంధ్రప్రదేశ్ మొట్టమొదటి స్థానంలో నిలిచిందని తెలియడం గర్వించదగ్గ అంశం.

రాష్ట్రాన్ని సమ్మిళిత వృద్ధి, సుస్థిర అభివృద్ధి దిశగా శీఘ్రగతిన తీసుకొని వెళ్లడానికి నా ప్రభుత్వం స్మార్టు గ్రామం - స్మార్టు వార్డు కార్యక్రమాన్ని ప్రారంభించింది. స్మార్టు ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ ముఖ్యమైన క్రియాశీల సదుపాయకల్పన పాత్రను పోషిస్తున్నది. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పరిశుభ్రత, పారిశుద్ధ్యాన్ని నిర్వహించడానికి, బహిరంగ మల విసర్జన నిర్మూలన, మానవ ప్రమేయ శుద్ధిని నిర్మూలించడం, ఘన, ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణ, వ్యర్థాల నుండి విద్యుత్, వ్యర్థరహిత గ్రామాల సమాచారం, విద్య సమాచార ప్రసారం, సామర్థ్య పెంపు చర్యల దిశగా కృషి చేస్తున్నది. 2018 నాటికి నూటికి నూరు శాతం ఓడిఎఫ్ సాధించడం

మా లక్ష్యం. జన్మభూమి - మా ఊరు కార్యక్రమ సమయంలో చేపట్టిన అవగాహన సర్వేలు కార్యక్రమం ప్రోత్సాహకరంగా ఉందని, పరిపాలనపై సుమారు 80 శాతం ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని వెల్లడించాయని ఆ విషయాన్ని మీతో పంచుకుంటున్నందుకు ఆనందంగా ఉంది.

రాష్ట్ర శాసనసభలు, లోక్‌సభకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించే అంశంపై జాతీయ స్థాయిలో తీవ్ర చర్చ ప్రారంభమయిందన్న విషయం ఎంతో ప్రోత్సాహకరంగా ఉంది. చారిత్రాత్మకంగా అవి అన్ని కలిసికట్టుగా ప్రారంభమయినా, వివిధ కారణాల చేత కాలక్రమంలో వేరు వేరుగా జరుగుతున్నాయి. ఇప్పుడు దాదాపు ప్రతి సంవత్సరం, అయితే సంవత్సరం అంతటా కాకుండా దేశంలోని అధిక భాగాలలో ఎన్నికలు నిర్వహించే దశకు చేరుకొంది. ఆ విధంగా రాజకీయ పార్టీలు మరియు ప్రభుత్వాలు ఎన్నికల అంచనాలపై దృష్టి వుంచవలసి ఉంటుంది. ఇది పరిపాలన, విధాన నిర్ణయం, పరిపాలన అంశాలపై పరిమితులను ఏర్పరుస్తుంది. రాష్ట్ర శాసనసభలు, లోక్‌సభకు ఏకకాలంలో రెండింటికి ఎన్నికలు నిర్వహించాలనే అంశంలో నా ప్రభుత్వం పూర్తిగా అంగీకరిస్తున్నది. దీనివల్ల రాష్ట్రాలలో మరియు కేంద్రంలో గల ప్రభుత్వాలు వాటి పదవీ కాలాల్లో విధానం, పరిపాలన అంశాలలో నిరంతరాయంగా శ్రద్ధ పెట్టగలుగుతాయి. నా ప్రభుత్వం మరొక అడుగు ముందుకు వేసి, రాష్ట్ర, కేంద్ర శాసనసభలకు ఎన్నికలు జరిగిన ఒక సంవత్సరం లోపు పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలకు కూడా ఎన్నికలు నిర్వహించాలని సూచిస్తున్నది. ఇది ప్రభుత్వాలకు పరిపాలన అంశాలను పరిష్కరించడానికి అంతరాయం లేకుండా పూర్తిగా నాలుగు సంవత్సరాల సమయాన్ని కల్పిస్తుంది. ఈ నేపథ్యంలో ఆలోచించి ఒక నిర్ణయం తీసుకోవడానికి అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో దేశవ్యాప్తంగా చర్చ జరగడం వాంఛనీయం.

రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉన్న కరవు పరిస్థితులను అధిగమించడానికి నా ప్రభుత్వం స్వల్పకాలిక మరియు దీర్ఘకాలిక చర్యలను చేపడుతున్నది. ప్రజల అవసరాలను తీర్చడానికి వాస్తవిక కాల పర్యవేక్షణ చేయడమవుతుంది. పశుగణానికి నీటిని, పశుగ్రాసాన్ని సరఫరా చేయడం, బోరుబావుల నిర్వహణ వంటివి కొన్ని స్వల్పకాలిక చర్యలుగా ఉన్నాయి. నదుల అంతర్గత అనుసంధానం, స్మార్ట్ వాటర్ గ్రిడ్ మొదలైన వాటిని ఏర్పాటుచేయడం వంటివి దీర్ఘకాలిక చర్యలలో చేరివున్నాయి. 2015-16

సంవత్సరానికి రూ. 605 కోట్ల ఉత్పాదక సబ్సిడీని విడుదల చేయడం, ప్రస్తుత సంవత్సరానికి రూ.1762 కోట్లకు సంబంధించిన ప్రతిపాదనలను రైతుల ఉపశమనం కోసం సమకూర్చడమవుతున్నది. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ క్రింద వివిధ శాఖల కలయిక ద్వారా ఉపాధి కల్పించడం జరుగుతుంది. కరవు సహాయక చర్యల అమలుకు నిధుల లభ్యత అవరోధంకాబోదు.

పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనలు ప్రత్యేకించి విద్యా విషయక, ఆరోగ్య, ఆర్&డి సంస్థల ఏర్పాటుకు సంబంధించిన వాటిని అమలుచేయడానికి కేంద్ర ప్రభుత్వం కొన్ని చర్యలను తీసుకున్న విషయం మీకు విదితమే. అయితే, నూతన రాష్ట్రం కోసం రైల్వే జోన్‌కు సంబంధించిన నిబంధన ఇంకా అపరిష్కృతంగానే వుంది. మన రాష్ట్రానికి రైల్వే జోన్ తీసుకొని రావడానికి ప్రతి అవకాశాన్ని వినియోగించుకొంటుందని గౌరవ సభ్యులకు హామీ ఇస్తున్నాను. విశాఖపట్టణంలో జోన్‌ను ఏర్పాటు చేయడానికి నా ప్రభుత్వం కట్టుబడి ఉంది. దుగ్గిరాజుపట్నం వద్ద నూతన భారీ ఓడరేవును అభివృద్ధి పర్చాలని, కడప జిల్లాలో ఏకీకృత స్టీలు ప్లాంట్‌ను, విశాఖపట్టణం, విజయవాడ ప్రాంతాలలో మెట్రో రైలు సదుపాయాన్ని నెలకొల్పాలని నా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. నియోజకవర్గాల హద్దుల నిర్ణయం మరియు రాష్ట్రంలో శాసనసభ నియోజకవర్గాల సీట్ల సంఖ్యను 175 నుండి 225కు పెంచడం కోసం పునర్వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనల అమలు కోసం కేంద్ర ప్రభుత్వంతో నా ప్రభుత్వం సంప్రదించడం జరుగుతుంది.

మన రాష్ట్రానికి సంభవించే ఆర్థికపరమైన మరియు ఇతర అసమతుల్యతల గురించి పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పొందుపర్చలేదన్న విషయం మీ అందరికీ తెలుసు. "కేంద్ర సహాయక ఉద్దేశాల కోసం" ప్రత్యేక కేటగిరీ హోదాకు చట్టబద్ధత కల్పించలేదు. మారిన పరిస్థితుల నేపథ్యంలో, ముఖ్యంగా 14వ ఆర్థిక సంఘం సిఫారసుల తరువాత నిధుల సంక్రమింపు కోసం ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాలతోపాటు అన్ని రాష్ట్రాలను ఒకే విధంగా పరిగణనలోకి తీసుకొంటున్నందున ప్రత్యేక కేటగిరీ హోదాను ఇచ్చే విధానాన్ని విరమించుకోవడమవుతున్నదని భావించడమయింది. ప్రస్తుతం హోదా కలిగివున్న రాష్ట్రాలు ఈ నెల చివరి నుండి కలిగివున్న హోదాను కోల్పోయే విషయం మీ అందరికీ తెలుసు. అయితే, ప్రత్యేక కేటగిరీ హోదా స్థానే మన రాష్ట్రానికి ప్రత్యేక సహాయాన్ని

ప్రకటించడంలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రభావితం చేయడం మరియు అంగీకరింప చేయడంలో మేము జరిపిన నిరంతర కృషి ఫలించింది. ప్రత్యేక కేటగిరీ హోదా క్రింద రాష్ట్రానికి చేకూరే మద్దతు, రాయితీలు మరియు సహాయాలన్ని ప్రత్యేక సహాయంలో భాగంగా వుంటాయని కేంద్ర ప్రభుత్వం మనకు వివరించింది. వాస్తవానికి ఒక పేరు తప్ప ప్రత్యేక కేటగిరీ హోదా క్రింద రాష్ట్రానికి వచ్చే అంశాలన్నీ ప్రత్యేక సహాయం క్రింద రాష్ట్రానికి లభిస్తాయి. నా ప్రభుత్వం ప్రత్యేక సహాయానికి చట్టపరమైన మంజూరును కోరుతున్నది. నా ప్రభుత్వం ప్రత్యేక సహాయానికి చట్టబద్ధత సాధిస్తుంది.

సామాజికాభివృద్ధి, దాని అభ్యున్నతి కోసం శాంతి భద్రతల ప్రాధాన్యత గురించి నొక్కి చెప్పాల్సిన అవసరం లేదు. నా ప్రభుత్వం రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడటంలో అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుంది. ప్రాణ, ఆస్తి రక్షణ ప్రజలకు విశ్వాసాన్ని కల్పిస్తుంది. వారు నిర్భయంగా ఆర్థిక కార్యకలాపాలకు వెళ్లగలుగుతారు. పెట్టుబడిదారులు మన రాష్ట్రాన్ని వారి గమ్యస్థానంగా ఎంచుకోవడానికి శాంతియుత వాతావరణం అనేది ఒక అదనపు, ముఖ్యమైన అంశంగా ఉంటుంది. నేరాలను కనుగొనడానికి మాత్రమే కాకుండా వాటిని నివారించడానికి కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం నా ప్రభుత్వ ప్రాధాన్యతా అంశం. నిఘా కోసం సిసి టీవి కెమెరాలు, డ్రోన్లు, బాడీవోర్న్ కెమెరాలు అడ్వాన్స్‌డ్ ఫోరెన్సిక్ టెక్నిక్‌లు వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం నా ప్రభుత్వ ప్రాధాన్యతా అంశం. రాష్ట్రంలో చట్టాలను అతిక్రమించి, అశాంతిని, అలజడిని సృష్టించడానికి ప్రయత్నించే శక్తులకు ఎటువంటి స్థానం లేదు. రాష్ట్రంలోని మహిళల రక్షణ, భద్రత కోసం నా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతుంది అన్నదే నా ప్రభుత్వ సరళీకృత, నేరుగా ఇచ్చే సందేశం.

అవినీతి అనేది ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన విఘాతం కల్పించే సమస్య మాత్రమే కాకుండా సామాజిక అస్థిరతకు కారణమవుతుంది. అవినీతిపై పోరాడేందుకు డిజిటల్ టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగించుకోవడమవుతుంది. నేరస్తులను కనిపెట్టి, శిక్షించేందుకు నా ప్రభుత్వం పటిష్టమైన విధానాలను రూపొందించడమే కాకుండా పారదర్శకమైన పరిపాలన నిమిత్తం నిజాయతీ పరులను ప్రోత్సహించి, పటిష్టవంతమైన నైతిక వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఆశిస్తున్నది.

సాధించిన విజయాలు ప్రోత్సాహకరంగా వున్నప్పటికీ, వృద్ధి వేగాన్ని కొనసాగించి, దార్శనికతను సాకారం చేసుకొనేందుకు అభివృద్ధి ప్రక్రియలోని భాగస్వామ్యులందరి నుండి ఉమ్మడి చర్యలు అవసరమవుతాయని ఆశిస్తున్నాను. నా ప్రభుత్వం తన వాగ్ధానాలన్నింటిని నెరవేర్చడానికి కట్టుబడి ఉందని పునరుద్ఘాటిస్తున్నాను. నా ప్రభుత్వం అభివృద్ధి ఫలాలు చివరి పంక్తిలోని చివరి వ్యక్తి వరకు చేరుకొనేలా చూడటం, ఆంధ్రప్రదేశ్‌ను ఒక ఆరోగ్యవంతమయిన, సమ్మిళిత, శాంతియుత, ప్రగతిశీలక, సుసంపన్నమయిన, ప్రపంచ వ్యాప్తంగా పోటీపడేలా మరియు సంతోషకరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి నిరంతరం కృషి చేస్తుంది.

****జైహింద్****

ముద్రణ కమీషనర్ గారిచే ఆంధ్రప్రదేశ్ శాసనసభ ముద్రణాలయం, అమరావతి నందు ముద్రించబడినది.